



కథానిక

సాయంకాలం అయిదుగంటలవేళ...

విశ్వం మెయిన్ రోడ్డుమీద నడుస్తున్నాడు.

జనం క్రిక్కిరిసి ఉన్నారు—కిళ్ళీ దుకాణాల ముందూ, సోడాషాపుల ముందూ. కాఫీ హోటళ్ళ లోని రేడియోలు సినిమాపాటలు వినిపిస్తున్నాయి. విశ్వం అవేమీ గమనించటంలేదు. జేబుల్లో చేతు లుంచుకుని నెమ్మదిగా నడుస్తున్నాడతను. మెదడు మాత్రం తీవ్రంగానే పనిచేస్తున్నది.

ఫస్టుతారీకు యింకా వారం రోజుల క్కాని రాదు. కనీసం యింకా వారం రోజులు గడవాలి. ఇంట్లో బియ్యం దగ్గరనుంచీ తేవాలి. తెల్లవారితే బియ్యంలేవు. ఆ రోజే అప్పు తెచ్చానన్నది విమల.

అయిదు రూపాయలు — ఎలాగైనా ఒక అయిదు రూపాయలు సంపాదిస్తే గండం గడచి పోతుంది ప్రస్తుతానికి!...మళ్ళీ ఫస్టుతారీకు రానే వస్తుంది. కొన్నిరోజులు గడచిపోతాయి మళ్ళీ నెలాఖరు మళ్ళీ గండం. మళ్ళీ ముప్పెత్తడం... ఇంతే—జీవితపర్యంతరం! యిదే—జీవితం అంటే!—అవును యింకా ఏమిటి జీవితం యిది కాకపోతే!

అత్యవసరంగా కావాలి అయిదురూపాయలు. ఎవరినైనా అడగాలి, ఎవరినైనా యిచ్చేవాళ్ళనిగా చూసి అడగాలి. ఎవరిస్తారు?...డబ్బుకు అంతగా యిబ్బంది పడకుండా తనకి యీ నెలాఖరు రోజుల్లో యివ్వగలవారెవరున్నారు?

తనకి తెలిసిన వాళ్ళనందరినీ మనస్సులో గుర్తుకు తెచ్చుకుంటూ నడుస్తున్నాడు విశ్వం.

రామేశం, సంజీవరావు, రవీ.

ఎవరినైనా అడగాలి—వీళ్ళల్లో!...ఎలాగైనా సంపాదించాలి...తప్పదు.

ఎవరైనా కనిపిస్తారేమోనని చూస్తూ నడుస్తున్నాడు విశ్వం.

అవసరమైనప్పుడు ఎవ్వరూ త్వరగా కన్పించరు! రోజూ ఆ వేళకు 'రమణావిలాస్' ముందు కిళ్ళీ కొట్లో కూర్చుని కన్పించేవాడు రామేశం. సంజీవరావు ప్రతిరోజూ సాయంకాలం వేళకు చౌదరిగారి మెడికల్ షాప్‌లో కూర్చుని ఉండేవాడు. ఇక రవి సైకిలుమీద అటూ యిటూ తిరుగుతూ రోజుకు పదిసార్లైనా కన్పించేవాడు. ఈ రోజు ఒక్కరు—ఒక్కరు కన్పించడంలేదు!

"రమణావిలాస్" ముందు కిళ్ళీ కొట్టులో కూర్చున్న ఒకాయనను అడిగాడు విశ్వనాథం—"రామేశంగారు వచ్చారండీ?" అని.

ఆయన "రాలేదండీ..." అన్నాడు.

విశ్వం ముందుకు సాగాడు ఎలా? ఏంచేయాలి? రోడ్డుమీద యింతమంది నడుస్తున్నారు. వీళ్ళల్లో ఒక్కరైనా తనకి యీ రోజున ఎలాగైనా ఒక్క అయిదు రూపాయలివ్వగలిగితే!

విశ్వం నవ్వుకున్నాడు—తన తెలివి తక్కువ తనానికి ఎవరిస్తారు? ఎవరిక్కావాలి? ఎవరిగోడ వల్లో వారు సతమత మవుతూంటారు!

మెడికల్ షాపు సమీపించింది. ఎవరో చాలా మంది కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. వాళ్ళల్లో సంజీవరావు ఉన్నాడా? విశ్వం పరీక్షగా చూశాడు. ఊహుఁ!...లేదు!...

బి. రామనాథ్

విశ్వనాథానికేమీ తోచడంలేదు .అయిదన్నర కావస్తోంది.

ఆ పూట ఎలాగైనా సరే సంపాదించాలి అయిదు రూపాయలు దానిలో కనీసం మూడు రూపాయలు పెట్టి బియ్యం ఒకపావు పౌను కాఫీ పొడరు సవాశేరు పంచదారా, రెండు సీసాలైనా కిరసనాయిలూ, ఒక అర్ధరూపాయకో-పదణాలకో కూరగాయలూ, అరె! అన్నట్లు ఒక సవాశేరు వెన్న తీసుకురావాలి కదూ?...ప్చ్... లాభంలేదు. చాలవు. ఒక పది రూపాయలుంటే బాగాసరిపోతాయి. అందులో విమలకు కాల్షియం యిజక్షన్లు కూడా యిప్పించవచ్చు! ఎన్నాళ్ళయింది డాక్టర్ ఆ మాటచెప్పి! యింతవరకూ పడనేలేదు. ఏ నెలకానెల అలాగే గడచిపోతోంది. ఈసారి తప్పకుండా యిప్పించాలి!

విశ్వం మళ్ళీ నవ్వుకున్నాడు; ఏమిటి తన ఆలోచనలు! అయిదు రూపాయలు యిచ్చేవాడు కనిపించడంలేదు. కాని పదెక్కడ దొరుకుతాయి? ముందు ఆ అయిదు దొరికితే అదే పదివేలు!

విశ్వం ఆలోచిస్తూనే బజారు చివరకు వచ్చేశాడు. పార్కుముందు ఆగాడు. పార్కులో కన్పిస్తారేమో అనుకుంటూ లోపలకు నడిచాడు.

రేడియో సంగీతం వినిపిస్తున్నది బాకాల్లోంచి. విశ్వం వెదికే కళ్ళతో పార్కంతా తిరిగాడు. రామేశం కానీ, సంజీవరావుగానీ, రవికానీ కన్పించలేదు.

ఏమిచేయడానికి తోచక అలాగే నిలబడిపోయాడు విశ్వం. ఇంతలో అతని దృష్టి గేటులోంచి లోనికి వస్తున్న ఒక వ్యక్తిపై పడింది. ఎవరతను? ... లింగమూర్తి! అవును-లింగమూర్తి కదూ? ఇతణ్ణి అడిగిచూస్తే? విశ్వనాథం ఆశగా ముందుకు నడిచాడు.

లింగమూర్తే ముందుగా పలకరించాడు.

"హల్లో" అని. విశ్వం చిరునవ్వుతో 'హల్లో' అని గ్రీట్ చేశాడు. ఇద్దరూ మందహాసాలతో హాండ్స్ షేక్ చేశారు.

"ఏమిటండీ విశేషాలు?" అన్నాడు విశ్వం యిద్దరూ లోపలికి నడిచి ఒకచోటకూర్చున్నారు.

"మీరు చూశారా, ఎగ్జిబిషన్ ట్రెయిన్?" అన్నాడు లింగమూర్తి.

"లేదండి యింకా. మీరు చూశారేమిటి?" అన్నాడు విశ్వం. "యిప్పుడిదే పట్టింది నాకు!" అని లోపల్లోపల గొణుక్కుని.

"ఆ! యిప్పు డక్కణ్ణించే రావడం" అన్నాడు లింగమూర్తి జేబులోంచి సిగరెట్ ప్యాకెట్ తీసి విశ్వనాథానికి అందిస్తూ.

"అలాగా! ఎలా వుంది?" అన్నాడు విశ్వం ఒక సిగరెట్ తీసుకుని.

"గ్రాండ్! చాలా బాగా అరేంజ్ చేశారు. ముఖ్యంగా, కొన్ని ఫొటోగ్రాఫ్స్ ఉన్నాయి-సింప్లీ వండర్‌ఫుల్. మోడల్స్ కూడా అద్భుతంగా ఉన్నాయి. 'యూ మస్టు సీ యిట్' తప్పక చూడాల్సిందే. కాని, అబ్బ! ఏం జనమండీ! నాలుగు గంటలు నిలబడ్డాము క్యూలో. విసుగేసింది" చెప్పుకుపోతున్నాడు లింగమూర్తి.

ఇద్దరూ సిగరెట్లు ముట్టించారు.

"మోడల్సా! ఏం మోడల్స్?" డబ్బు ఎలా అడగాలో తోచక, యింకా కొంతసేపు ఆ సంభాషణ పొడిగించాలనే కోరికతో అడిగాడు విశ్వం.

"ప్రాజక్టులు. తుంగభద్రా ప్రాజక్టు, హీరాకుడ్ డామూ, భక్రానంగల్... తరువాత, బొంబే, పూనా లైనూ, ఆటోమాటిక్ సిగ్నల్స్ సిస్టమూ అన్నీ ఉన్నాయ్‌లే. కాని, జనం ఎంతమందొచ్చారనీ! యిక ఆడవాళ్ళకి అంతే లేదనుకో."

లింగమూర్తి తాను చూసినవీ, చేసినవీ వర్ణించి చెప్పసాగాడు. విశ్వం తలకాయ ఊపుతూ వింటున్నాడు అప్పుడప్పుడు సిగరెట్ నోట్లో పెట్టుకుని దమ్ములాగుతూ. ఆరు కావస్తూ ఉంటుంది, బహుశా చీకటి పడ్తోంది. అడగాలి, తీరా అడిగితే ఉందంటాడో, లేదంటాడో, పుటుక్కున లేదనేస్తే? ఎంత తలకాయ కొట్టేసినట్లుంటుంది!

ఆ! అయినా, అడగదల్చుకున్నాక యీ ఆలోచనలన్నీ దేనికి? యిస్తే యిస్తాడు-లేకపోతే లేదంటాడు! అంతమాత్రానికి తనకి పోయిందేముంది? లేదన్నంతమాత్రాన తన గౌరవానికేం లోపం వస్తుంది?అవసరం-కనుకనే అడుగుతున్నాడు ఇందులో యింత ఆలోచించాల్సిందేముంది? కనక వెర్రి ఆలోచనల్ని వదిలేసి అడిగేస్తే నయం. "ఈ సిగరెట్ అయిపోగానే, ఏమైనాసరే అడిగేస్తాను" అనుకున్నాడు విశ్వం చేతిలోని సిగరెట్ చూస్తూ.

లింగమూర్తి ఎగ్జిబిషన్ గురించీ, అక్కడ చేరిన ఆడవాళ్ళను గురించీ చెప్పుతున్నాడు. విశ్వం శ్రద్ధగా వింటున్నాడనే అతని నమ్మకం.

సిగరెట్ అయిపోవచ్చింది. ఇంకా ఒక్కసారికి, ఆ ... అయిపోయింది! ఇక అడగాలి. సిగరెట్ ముక్కను నలిపి దూరంగా పారవేసి ప్రారంభించాడు విశ్వం.

"ఒక్క విషయం అడుగుతాను ఏమీ అనుకోకుండా ఉంటే. ఆ...ఏమీలేదు. అర్జంటుగా ఓ అయిదు రూపాయలు కావాల్సివచ్చినయ్. ఉంటే కాస్త చూస్తారూ? మళ్ళీ రేపు ఫస్టుకు ఇచ్చేస్తా."

లింగమూర్తి పకపకా నవ్వసాగాడు. "ఇందులో అనుకోడాని కేముందీ? సరిగ్గా నాదగ్గర లేని సమయం చూసి అడిగారు. నేనే ఎవరినైనా అడగాలనుకుంటున్నా! వెరీ సారీ!"

విశ్వం మాట్లాడలేకపోయాడు. ఏదో ఒక పెద్ద అగాధంలోకి పడిపోయినట్లుగా ఫీలయ్యాడు.

"ప్చ్ ఏం జీవితమోనండీ! నిజంగా మొన్ననో కథలో చదివాను గొర్రెలోక జీవితమని! అక్షరాలా అంతే! ప్చ్! ఫామిలీ అదీలేకుంటేనే నాకింత యిదిగా ఉండే ఇక ఫామిలీతో ఉండేవాళ్లకింకా ఎంత డిఫికల్ట్‌గా ఉంటుందో! "అసలు దీనికంతా కారణం మన గవర్నమెంటేనండీ! వందలూ వేలూ పుచ్చుకుంటారు—వాళ్లుమాత్రం! మనబోటి మిడిల్ క్లాస్‌వాళ్ల సంగతి ఆలోచించేవా డెవడండీ?"

లింగమూర్తి ప్రభుత్వాన్నీ, రాజ్యాంగాన్నీ పట్టుకుని నిశితంగా విమర్శిస్తున్నాడు.

విశ్వనాథం ఏమీ మాట్లాడలేదు. అతని కెందు వల్లనో — లింగమూర్తిదగ్గఱ డబ్బు ఉన్నదనీ, ఉన్నప్పటికీ తనకివ్వవలసి వస్తుందని లేదన్నాడనీ అనిపించింది. లింగమూర్తి దగ్గర డబ్బు లేకుండా ఉండదు! అనుకున్నాడు విశ్వం...ఎంత నటన!

ఇక అక్కడ కూర్చోలేకపోయాడు విశ్వం "సరేలెండి ఊరికే ఉన్నదేమోనని; నెవర్ మైండ్ వస్తా" అంటూ లేచి చకచకా నడిచాడు.

ఎక్కడకు వెళ్లాలి?

ఇక ఆరోజుకు లాభం లేదనుకున్నాడు. ఆరు దాటింది.

ఏమీ తోచక, తలకాయ వంచుకుని, నెమ్మదిగా ఒకమూలకు వెళ్లి, చెట్లచాటున, చీకట్లో ఒక రాతిబెంచీమీద కూర్చున్నాడు విశ్వం.

రేడియోలో ఏదో చెబుతున్నారు యింగ్లీషులో. విశ్వం విందామని ప్రయత్నించాడు. కాని అదేమీ తలకెక్కడంలేదు. క్షణక్షణం తన అసమర్థతే అతని మనస్సులో మెదిలి కలతపెడ్తోంది. ఇంటికి ఎలా వెళ్తాడు? వెళ్లగానే—"తెచ్చారా?" అని అడుగుతుంది విమల. ఏమని చెప్తాడు?

ఎంత దుర్దినం ఆరోజు! రామేశం, సంజీవరావు, రవీ వీళ్లల్లో ఒక్కరూ కన్పించరాదూ? పోనీ వాళ్లయిళ్లకువెళ్తే? అవును! అక్కడన్నా కన్పించరూ?..కన్పిస్తారు! అడుగుతాడు. యిస్తారా? లింగమూర్తి ఏమన్నాడు? నిజంగా లింగమూర్తి దగ్గర లేదా? తప్పక ఉండిఉంటుంది అంతా అబద్ధం చెప్పాడు! ఇక వాళ్లుమాత్రం యిస్తారని ఎలా అనుకోగలం? ఎంత స్నేహితులైతేమటుకు?

"హలో! ఏమిటి యిక్కడ కూచున్నారు చీకట్లో!"

విశ్వం తలయెత్తిచూశాడు. ఎదురుగా రవి! సైకిలు స్టాండు వేసివచ్చి ప్రక్కన కూర్చున్నాడు.

"రండి..." అన్నాడు విశ్వం ప్రక్కకు జరుగుతూ.

"ఇక్కడ కూచున్నారేం? చీకట్లో?" అన్నాడు రవి, జేబులో రుమాలుతీసి మొహం అద్దుకుంటూ.

"ఆఁ ఏమీలేదండి ఊరికేనే!" అన్నాడు విశ్వం, నవ్వు తెచ్చుకుంటూ.

"పార్కులో యిన్నిలైట్లు—యింత వెల్తురూ ఉన్నాయికదా! యింత కటికచీకట్లో కూచున్నారేమిటి? పదండి అలా వెల్తుర్లోకి వెళ్దాం" అంటూ లేవబోయాడు రవి.

"వద్దండీ! ఇక్కడనే బావుంది అంతవెల్తుర్లో నాకెందుకన్నో కూర్చో బుద్ధిపుట్టదు!..." అంటూ వారించాడు విశ్వం.

"అలా అంటారేం?..." అన్నాడు రవి కూర్చుంటూ.

"ఏమిటోనండి వెల్తురనేది జీవితంలోనే లేనప్పుడు యీలైట్లవల్ల ఏంవస్తుంది?"

"అంటే?"

"మీ అభిప్రాయమేమిటి? జీవితం అంటే ఏమిటని?"

"జీవితం అంటేనా! బావుంది! నా అభిప్రాయా నికేంగాని, మీరేమనుకుంటున్నారు?"

"మీ విషయం చెప్పండి ముందు!"

"అయితే వినండి! జీవితం అనేది ఒకపెద్ద అనుభవం. ఒకపెద్ద అవకాశం. అనుభవించాలి! అవకాశం వదులుకోకుండా పెసిమిస్టిక్‌గా నిట్టూర్పులు విడుస్తూ కూర్చోకుండా—ఎన్‌జోయ్ చేయాలి. జీవితంలో అందం ఉంది. జీవితంలో ఆనందం ఉంది!—అయితే అనుభవించడం చేత కావాలి!...అంతే!"

విశ్వం ఏమీ మాట్లాడకుండా వింటున్నాడు—రవినిచూస్తూ. జీవితంలో అందం ఉంది! ఆనందం ఉంది! అవును—రవి అలా అనుకోవడంలో ఆశ్చర్య మేముంది? అతనికి సమస్య అనేదేదీ కన్పిస్తేగా జీవితంలో? చేతివ్రేళ్ళకి తళతళామెరిసే ఉంగరాలు, సిల్కు—బుష్‌షర్టూ, కళ్ళకి రోల్డ్‌గోల్డ్ రిమ్సుగల అద్దాలూ...ఇక రవికి జీవితం అందాల పూల బాటగా కన్పించడంలో ఆశ్చర్యంలేదు! తెల్లవారితే యింట్లో 'అదిలేదు—యిదిలేదు'—అనే బెంగలేదు. 'ఈ రోజు ఎలా గడుస్తుందా' అనే దిగులు లేదు. నిజంగా వీళ్ళజీవితం 'వడ్డించినవిస్తరి' లాగానే ఉంటుంది.

"ఏమిటి ఆలోచిస్తున్నారు? మీ రెప్పుడూ యింతే! అంత పెసిమిజమ్ పనికిరాదు. పదండి వెల్తురులోకి పోదాం."

"జీవితమంటే ఏమిటో మీరు చెప్పారు. ఇక నేను చెప్పేదీ వినండి! జీవితం అంటే ఒక పెద్ద సమస్య...ఒకపెద్ద గండం...ఒకపెద్ద పరీక్ష...పోరాటం...శాపం. జీవితం అనేది ఒకపీడకల!"

విశ్వం ఆవేశంతో యిక మాట్లాడలేక పోయాడు. మాటలు దొరక్క అలాగే ఆగిపోయి చెట్లచాటునుండి దూరంగా కన్పించే ఆకాశంకేసి చూడసాగాడు.

"చూసేవాళ్ల దృష్టినిబట్టి ఉంటుంది!"అన్నాడు రవి ఆశ్చర్యంతో.

"అరే! టయిమైంది-పిక్చర్‌కి వెళ్దామనుకుంటు న్నాను-వస్తారా?"అన్నాడు రవి టైంచూసుకుంటూ.




విశ్వం తల ఆడించాడు—"వెళ్ళండి" అంటూ.

"వెళ్దాం రారాదూ? మంచిపిక్చరు. చాలా బావున్నదిట!"

విశ్వం మాట్లాడలేదు. అతడేదో తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

రవి లేచాడు—సైకిల్ స్టాండు తీసి—"రండి" అంటూ మళ్ళీ ఆహ్వానించాడు.

అనుకోకుండానే లేచాడు విశ్వం. ఇద్దరూ మాట్లాడకుండా నడక సాగించారు. దగ్గరలోనే ఉన్నది సినిమాహాలు. జనం ఎక్కువగాలేరు. రవి బుకింగ్ ఆఫీసుముందు ఆగి, జేబులోంచి పర్సుతీసి ఒక పదిరూపాయలకాగితం లోపలకు అందిస్తూ "రెండు కుర్చీటిక్కెట్లివ్వండి" అన్నాడు.

విశ్వం చూశాడు——పదిరూపాయలకాగితం! అందులో ఒక అయిదు అడిగితే? మళ్ళీ తన సమస్యలన్నీ కళ్ళముందు నాట్యం చేశాయి. అవును. అసలు విషయం మరచిపోయాడు! పదిరూపాయలు కావాలికదూ? అడుగుదామా? ఏమనుకుంటాడో! 'డబ్బుకోసమే కాబోలు జీవితం పీడ కలా, శాపం...అంటూ సాగించాడు!" అనుకుంటాడేమో! లింగమూర్తిలాగానే—లేదంటాడేమో! స్పేర్ చేయలేనంటాడేమో!

ఇద్దరూ మౌనంగా లోపల ప్రవేశించారు. రవి సైకిలు షెడ్‌లోపెట్టి రెండుకిళ్ళీలు తీసుకుని లోపలకు వచ్చాడు.

విశ్వం కిళ్ళీనములుస్తూ 'థాంక్స్' అని అస్పష్టంగా గొణిగి, సినిమావంక దృష్టి మరల్చాడు.

పిక్చరు చూసేంతసేపూ, ఆ యాక్టర్లను గురించీ, డైరెక్టరును గురించీ ఏవేవో చెబుతూనే ఉన్నాడు. ఆ పిక్చరు అఖండంగా ఉంటుందని తనకి ముందే తెల్సునట! డైరెక్టరు——వన్ ఆఫ్ ది బెస్టట! అ పిక్చర్‌ని ఇంగ్లీషులోకూడా డబ్‌చేసి వరల్డంతా రిలీజుచేయాలనుకుంటున్నారట.

విశ్వం సినిమా చూస్తున్నంతసేపూ తనేదో పొరపాటుచేస్తున్నట్లు ఫీలయ్యాడు. ఇది సినిమాచూసే సమయమేనా! ఇంటిదగ్గర విమల ఎదురుచూస్తూ ఉంటుంది. తను డబ్బుకోసం బయల్దేరాడు. ఇంతవరకూ ఎక్కడా సంపాదించలేకపోయాడు. పైగా నిశ్చింతంగా కూర్చుని సినిమాచూడడమా! రవిదగ్గర డబ్బు ఉన్నది. అడిగితే యిస్తాడేమో! కాని అడగాలంటే ఏమిటోలా ఉన్నది. ఏదో తెలియని భయం, అర్థంకాని ఆవేదనా అతణ్ణి ఉక్కిరిబిక్కిరి చేసేస్తున్నాయి.

తెరమీద హీరో-హీరోయిన్ భుజాలమీద చేతులువేసి, దూరంగాఉన్న చందమామనీ, చెట్టుమీద కోయిలనీ చూపిస్తూ పాటపాడుతున్నాడు. ఉన్నట్లుండి, ఆవిడకూడా హీరోవైపు తిరిగి తలకాయ అతడిగుండెలకానిస్తూ ఒక చరణం అందుకున్నది. ప్రేక్షకులు తన్మయత్వంతో కథలో లీనమైపోయి చూస్తున్నారు.విశ్వనాథానికి చిరాకు పుట్టుకొస్తోంది. ఒక చెంప దిగులుతో కుమిలిపోతూంటే, —యీ ప్రేమ యీ విరహం— యివన్నీ ఎవడిక్కావాలి? ఇదొకటి నేర్చారు! ఏ సినిమాలో చూసినా యీ పాటే! విశ్వనాథం విసుక్కుంటూ కూర్చున్నాడు.

సినిమా అయిపోగానే అంతా లేచి గుంపులు గుంపులుగా బయటపడ్డారు. రవి త్వరగానే వెళ్ళి సైకిలు తెచ్చుకుని గేటుదగ్గర విశ్వాన్ని కలిశాడు. ఇద్దరూ జనంలో నెమ్మదిగా వీధిమీదికి వచ్చారు. ఇక యిళ్ళకిపోవాలి. ఇప్పుడే అడిగితే! విశ్వం, ఎలాగైతేనేం-తెగించి అడిగేశాడు——

"చూడండి...మీరేమీ అనుకోకుండా ఉంటే ఒక ఫైవ్‌రుపీస్ చాలా అర్జంటుగా కావాల్సివచ్చాయ్. మళ్ళీ రేపు ఫస్టుకిచ్చేస్తా."

రవి నవ్వలేదు..."చంపేశారు! ఫైవ్ స్పేర్ చెయ్యలేను. కాని ఒక టూ రుపీస్ స్పేర్‌చెయ్యగలను"అంటూ జేబులోంచి రెండు రూపాయల కాగితంతీసి అందించి "గుడ్‌నైట్"అంటూ సైకిలెక్కి వెళ్ళిపోయాడు. విశ్వ "థాంక్స్" అంటూ కాగితం జేబులోపెట్టుకున్నాడు.

నెమ్మదిగా యింటిదారిపట్టాడు. ఎలాగైతేనేం, రెండురూపాయలు సంపాదించగలిగాడు బ్రహ్మప్రయత్నంమీద అదీను. ఏంజీవితం యిది? ఎక్కడున్నది వెలుగు? ఎక్కడున్నది అందం! ఎక్కడున్నది ఆనందం? రవి అంటాడు——పెసిమిస్టులాగా ఆలోచించేవారికి అలాగే కన్పిస్తుందిట? పెసిమిస్టిక్‌గా ఎందుకని ఆలోచించాల్సి వస్తున్నదో అతనికర్థం అయితే- ఎలా ఎందుకంటాడు? ఇంతకీ యిప్పుడీ రెండురూపాయలు దేనికి సరిపెట్టేటట్లు? ముందు బియ్యంతెచ్చుకుని యింట్లో పోసుకుంటే సరి. మిగిలినవాటిసంగతి దేవుడికే తెలియాలి అనుకుంటూ యిల్లుచేరాడు.

ఇంట్లో అడుగుపెట్టడానే "ఇంత ఆలస్యంగా వచ్చారేమండీ?"అని ఆప్యాయంగాఅడిగింది విమల.

"ఊఁ అయింది ఆలస్యం"అంటూ తలకాయ వంచుకుని, చీకటి గదిలోకి వెళ్ళి కూర్చున్నాడు.

"ఆ టేబుల్లో అయిదురూపాయల కాగితం ఉన్నది చూడండి"అన్నది విమల.

"ఎక్కడిది?"అన్నాడు ఆశ్చర్యంతో.

"పక్కయింటి ఆవిడనడిగి పుచ్చుకున్నా మీకు దొరుకుతుందో దొరకదోనని."

"ఊహూఁ!"అని నిట్టూర్చాడు విశ్వం. ★